


# తోడు

— కొమురవోలు సరోజ

"అమ్మాయ్ కమలా! కాస్త అటు బజారుకు వెళ్ళినప్పుడు నా జుట్టుకు రంగు కొనుక్కురామ్మా" చెప్పింది ఆదిలక్ష్మి. సీరియస్‌గా ఏదో రాసుకుంటున్న కమలకు చికాకొచ్చింది.

"మీ జుట్టుకు రంగెందుకండీ? ఈ వయస్సులో మీరు అందంగా ఎంగ్‌గా కనబడాలనే కోరిక ఎందుకో నాకర్థం కావటం లేదు" తల ఎత్తకుండానే జవాబు చెప్పింది కమల.

"అదేం మాటమ్మా! నా కంటే పెద్దది మీ అమ్మ తలకు రంగు వేసుకోవటంలా?" నిష్ఠూరంగా అంది ఆదిలక్ష్మి.

"మా అమ్మతో మీకేం పోటీ! మా అమ్మకు నెలకు బోలెడంత పెన్షనొస్తుంది. ఆమె పెద్ద ఆఫీసరుగా రిటైరయ్యింది."

"చూడు కమలా! కోరికలందరికీ వుంటాయి. నేను ఆఫీసరుగా చేసి వుండకపోవచ్చు. కానీ మీ మామగారు పెద్ద ఆఫీసరుగానే రిటైరైనారు. ఆయన పదవిలో వున్నప్పుడు ప్రతి ఫంక్షనుకూ నేనూ వెళ్ళేదాన్ని. గత ముప్ఫయి సంవత్సరాలుగా నేను హెయిర్ డై చేసుకుంటున్నాను. ఈమధ్య కాలంలో కొంచెం ఓపిక తగ్గటంవల్ల ఎవర్నైనా చెయ్యమంటున్నాను."

"బాగా వుందిలెండి. ఇవ్వాళ జుట్టుకు రంగంటారు. రేపు ముఖానికి కాస్మటిక్ సర్జరీ అంటారు. ఇంకా నాలుగు రోజులు పోతే... కంపేనియన్ అంటూ ఎవరో ఒక మగవాణ్ణి కూడా పట్టుకొచ్చి ఇంట్లో పెడతారేమో!" సీరియస్‌గా అంది కమల.

"సరేలే అమ్మా! ఇన్ని మాటలెందుకూ! నీకిష్టం లేదని ఒక్క మాట చెబితే సరిపోతుందిగా!"

"మీ పని వంట చేయటం, పిల్లలక్కావలసిన పన్లు చూడటం తప్ప ఇంకోటి కాదనీ, చెయ్యకూడదనీ ముందే చెప్పాను కదండీ! ఇవాళ ఒక్కరోజు నేనింట్లో వుండేది. ఆ రోజు కూడా మీరు జుట్టుకు రంగూ, వంటికి సెంటూ అంటూ నన్ను ఊపిరి తీసుకోనివ్వరా?"

మౌనంగా తన గదిలోకి వెళ్ళి బెడ్ మీద పడుకుని మరణించిన తన భర్తను తల్చుకుని ఓపిక వున్నంతసేపూ ఏడ్చింది ఆదిలక్ష్మి. తనకే నలుగురు పిల్లలు పుట్టివుంటే ఈ గతి పట్టేది కాదు. భగవంతుణ్ణి ఎంత ప్రార్థించినా తనకు మరో బిడ్డ కలగలేదాయే! ఏం చేస్తుంది తను!

కనీసం ఒక్క కూతురుంటే ఎంత బాగుండేది! కోడలు కమల ఎన్ని మాటలనగలిగింది? అదే తన బిడ్డ అయితే అంటుందా! తన అక్క కూతురు తల్లికి రెండు జడలు వేసి చూసి మురిసిపోతుంటుంది. దానికి భర్త సహకారం లేదు. అయినా తల్లిని ఎంత ప్రేమగా చూసుకుంటోంది! వద్దురా భగవంతుడా ఈ వృద్ధాప్యం! అని ఎంతగానో అనుకుంది. అనుకున్నా అనుకోకపోయినా ప్రకృతిధర్మం అది. తన భర్త అదృష్టవంతుడు. తొందరగా వెళ్ళిపోయాడు, మంచానా, కంచానా పడకుండా. తనకు ఇండియాలో ఎవరూ లేనందువల్ల ఈ కెనడా వచ్చి దిక్కుమాలిన బ్రతుకు బ్రతకాల్సొస్తోంది. ఈ వయస్సులో తనకు మగతోడు కావాలా! ఎంత మాటంది! తనంటే అసలు లెఖ్ఖే లేదు వీళ్ళకి. తనకు వచ్చే ఓల్డేజ్ పెన్షన్ మటుకు కావాలి. పిల్లలిద్దర్నీ బేబీ సిట్టింగ్‌కి పంపకుండా డబ్బులు దాచుకుంటున్నారు. ఇండియా వెళ్ళి ఉందామంటే అక్కడ నలుగురూ 'కొడుకు దగ్గరకెళ్ళి ఉండరాదుటమ్మా! ఎటుబోయి ఎటొస్తుందో!" అని ఒకటే గోల. సరే, వచ్చినప్పటి నుంచీ స్థిమితముంటేగా! తన కొడుకు ఉదయ్‌కి ఏమీ పట్టదు. పట్టించుకున్నా "అమ్మా కమల చెప్పినట్లు చేయి" అంటాడు. వాడు ప్రొద్దున్నే పుట్టాడని తను ముచ్చటగా 'ఉదయ్‌నాథ్' అని పేరు పెట్టింది. ఏం లాభం! వాడి మనస్సు నిండా 'డబ్బు' అనే చీకటి ముసురుకుని కళ్ళు కనబడటం లేదు.

• • •

"ఇదుగో ఉదయ్ మీ అమ్మ పద్ధతి నాకేం నచ్చటం లేదు. నేను వద్దంటున్నా వినకుండా నైసన్ ఈజీ హెయిర్ డై తెప్పించుకుంది. నన్ను డై చేయమని అడిగింది, రెండు మూడుసార్లు. నేను చేయలేనని చెప్పి ఆ మంగళగౌరి చేత చేయించుకుందిట. ఆ మంగళగౌరి సామాన్యురాలు కాదు. న్యూస్‌పేపర్ కంటే ఎక్కువ. ఊరూ వాడా అందరికీ చాటింపు వేసేసిందప్పుడే. 'వాళ్ళ కోడలు ఆవిడకు హెయిర్ డై చేయమంటే చెయ్యలేదుట. అందుకే నన్నడిగింది పాపం. నేను చేశాను' అని చెప్పిందట. నిన్న తెలుగు ఫంక్షన్‌లో తలెత్తుకోలేకపోయాను" చెప్పి ఏడవటం మొదలుపెట్టింది కమల.

"ముసలావిడకి సరదాగా వుందేమో! చేయవలసింది నువ్వు."

"బాగుందండీ ఆవిడకు లేడికి లేచిందే పరుగన్నట్లు తలుచుకోగానే కావాలంటుంది. నేను చేసే వరకూ ఆగుతుందా? ఏమన్నానా! నే చెయ్యకపోతే ఎవరిచేతనో చేయించుకుంటుంది. అసలంత అర్జంటేమిటి? నిన్నటి ఫంక్షన్‌కు తలకు రంగేసుకోకపోతే రానివ్వరా! ఓల్డు పీపుల్ ప్రాబ్లెమ్ అంతా నా తలకు చుట్టుకుంటోంది. నిన్న ఫంక్షన్లో వాళ్ళందరూ తప్పు నాదన్నట్లు మాట్లాడారు. ఇలా అయితే నేను సహించేది లేదు. కావాలంటే మీరూ మీ అమ్మగారూ వుండండి. రంగులే వేసుకుంటారా, రత్నాలే మింగుతారో! తల్లీ కొడుకులు ఎవరి తలకు ఎవరు రంగు పులుముతారో మీ ఇష్టం. రేపే నేను పిల్లల్ని తీసుకుని మా అన్నయ్యా వాళ్ళింటికెళ్ళిపోతాను."

ఉదయ్ భార్యను బ్రతిమాలి బుజ్జగించాడు. అప్పటికి ఆ విషయం అంతటితో ఆగిపోయినా, ప్రతిరోజూ కొత్త కథ సృష్టి అవుతూనే వుంది.

"ఫర్ ఎ ఛేంజ్ ఇవ్వాళ నేను వంట చేస్తే మీ అమ్మగారు మెచ్చుకోలేదనో. ఆవిడకి అన్నీ తన దారిలోనే జరగాలి అనో మొన్న గెస్టులొచ్చినప్పుడు ఎక్కువ వండి వేస్ట్ చేసిందనో! పిల్లల బెడ్ మీద పిల్లలకు కథలు చెబుతూ ఆమె కూడా నిద్రపోయిందనో!" అన్నీ ఏదో చిలవలూ పలవలూ అల్లి పూర్వకాలం అత్తగారిలా బిహేవ్ చేస్తూనే వుంటుందంటుంది. కమలకు అత్తగారు తన దగ్గరుండటం ఏమాత్రం ఇష్టం లేదు. కానీ తప్పనిసరి.

"ఎవరైనా వచ్చినప్పుడు పాంట్లూ, పంజాబీ డ్రెసలు వేసుకుని వాళ్ళ ఎదురుగా రావద్దని ఎన్నిసార్లు చెప్పినా వినదు. తనక్కావలసిన వస్తువులన్నీ ఎవరి చేతనో తెప్పించుకుంటోంది. మనం ఇంటికొచ్చేసరికి ఏం తెలియనట్లు ముంగిలా వుంటుంది" అంది.

"పెన్షనంతా మనమే తీసుకుంటున్నాంగా! డబ్బు లెక్కడివి ఆవిడకు?" ఆశ్చర్యంగా అడిగాడు ఉదయ్.

"ఏమో నాకేం తెలుసు. మీకూ మీ అమ్మగారికీ ప్రతిదీ రహస్యమేగా!" మూతి విరుచుకుంది కమల.

• • •

రాత్రి తొమ్మిది గంటల సమయంలో భోజనాలయ్యాక టీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు కమలా, ఉదయ్. ఆదిలక్ష్మి కిచెన్ సర్దేసి తన

రూమ్‌లోకెళ్ళింది. తన విలువైన వస్తువులూ తన భర్త ఫొటో, సూట్‌కేసనూ, బ్యాగ్‌లనూ సర్దుకుంది.

ఇంతలో డోర్ బెల్ మ్రోగింది. ఉదయ్ వెళ్ళి తలుపు తీశాడు.

"ఆదిలక్ష్మిగారున్నారా?" అడిగాడాయన.

"ఉన్నారు. మీరు?"

"నేను ప్రీస్టుని. నాపేరు పైడయ్య" చెప్పాడాయన..

"రండి, కూర్చోండి" అని చెప్పి తల్లిని పిలిచాడు. ఆదిలక్ష్మి సామానుతో పాటు బయటకు వచ్చింది. ఉదయ్ కమలా ఇద్దరూ చేష్టలుడిగినట్లు చూస్తూండి పోయారు. అక్కడ ఏం జరుగుతుందో, ఏం జరగ బోతోందో వాళ్ళకర్థం కాలేదు.

పైడయ్యగారి దర్పం, దర్జా, హుందాతనం వీళ్ళని అవక తవక ప్రశ్నలు వెయ్యనివ్వలేదు.

"వెళ్ళొస్తాను కమలా, ఉదయ్" చెప్పింది ఆది లక్ష్మి

"ఎక్కడికమ్మా ప్రయాణం! ఏమిటిదంతా? ఈయనకూ నీకూ ఏమిటి సంబంధం?" అడిగాడు ఉదయ్. జవాబుగా చిరునవ్వు నవ్వింది ఆదిలక్ష్మి అరవై అయిదేళ్ళ అమ్మ ఇప్పుడు కూడా నవ్వితే ఎంత కళగా వుందో!" అనుకున్నాడు ఉదయ్. అత్తగార్ని చూసి కొద్దిగా అసూయపడింది కమల.

"నేను చెబుతాను వినండి" చెప్పారు పైడయ్య గారు.

"మీరా?" అడిగారు కమలా, ఉదయ్ ఒక్కసారే.

"అవును నేనే. ఏం చెప్పకూడదా?"

"లేదు. చెప్పండి."


"ఈమె ఈరోజునుండి నాతోపాటు వుంటారు. అందుకు కారణం కేవలం మీ ప్రవర్తనే. పెద్దవాళ్ళను ప్రేమించటం నేర్చుకోవాలయ్యా. ఏం మీకేనా కోరికలుండేవి? వయస్సు మళ్ళినవాళ్ళకు కోరిక లుండవనుకుంటున్నారేమో! ఈ నిమిషంలో పోయే వాళ్ళకు కూడా కోరికలుంటాయి. సాధ్యమైనవి తీర్చడానికే పిల్లలు ప్రయత్నించాలి. పెద్దవాళ్ళు కోరికలు లేనివాళ్ళు మనస్సు లేనివాళ్ళు కాదు. వయస్సు శరీరానికి వస్తుంది. హృదయానికి కాదు. మీరూ అవుతారు పెద్దవాళ్ళు. ఆ విషయం మరచిపో కండి. తల్లిని మీలో ఒక మనిషిగా చూడగలగాలి కానీ పనిమనిషిలా కాదు. పని మనుషులు కూడా అనవసరంగా అంటే పడరని మీకు తెల్సే వుంటుంది..

"ఏమ్మా మీ అత్తగారు తలకు రంగు వేసుకుని, శుభ్రంగా, ఫాషన్‌గా వుంటే మీకు పరువు పోతుందా?

"ఆవిడ పెన్షన్ డబ్బంతా మీరు తీసుకుంటూ ఆవిడకేదైనా కావాలంటే ఎలా కొనుక్కుంటుందను కుంటున్నారు?" అప్పటివరకూ మౌనంగా వింటూ ఆయన ప్రశ్నలకు జవాబివ్వని కమల "ఆవిడకెం దుకు డబ్బు? ఏం చేసుకుంటుంది?" అన్నది.

"అది మీకనవసరం. కొడుకులు కోడళ్ళు సరిగా చూడరనే ఈ దేశాల్లో ఈ పద్ధతి పెట్టారు. మీరు దాన్ని కూడా ఇలా ఉపయోగించుకోవటం ఏం బాగాలేదు. మీ ఇద్దరికీ ఉద్యోగాలుండి కూడా అంత దురాశ పనికిరాదు. నా పిల్లలే నయం మీ కంటే. మా అమ్మాయికి ఉద్యోగం లేదు. అది భర్త మీద ఆధారపడిన మనిషి. మా అబ్బాయికి ఉద్యో గం లేదు. వాడు భార్యమీద ఆధారపడినవాడు. కానీ వాళ్ళెవరూ నా డబ్బు ముట్టుకోరు. నేనే వాళ్ళకు ఋణమో పణమో ఇస్తూంటాను. నన్ను వాళ్ళు బాగానే చూసినా నాకు స్వతంత్రంగా వుండటం అలవాటైనందున వాళ్ళ ఇళ్ళల్లో వుండలేకపోయాను. ఆమధ్య మా మనమరాల్ని బేబీ సిట్ చేశారు ఆది లక్ష్మి గారు. అప్పుడే వారితో పరిచయం అయింది. నేను ఇళ్ళకు వెళ్ళి ఉచితంగా పూజలు చేయించి వస్తూంటాను. మూడు తరాల క్రిందట మావాళ్ళు తెలుగువాళ్ళే. మా తాతగారి తండ్రి, ఆయన తండ్రి విశాఖపట్టణం నుండి మారిషస్‌కి వచ్చారు. నేను మారిషస్‌లో స్కూల్లో టీచరుగా చేసేవాణ్ణి. హిందూ మతం, పద్ధతుల పట్ల సద్భావం వుంది కనుక పౌరో హిత్యం నేర్చుకున్నాను. అది ఈ దేశంలో నాకు కాలక్షేపం, మోక్ష సాధనా తృప్తి ఆనందం కలిగిస్తోంది. కెనడా ఎందుకొచ్చానా అని బాధపడటం లేదు.

"ఆదిలక్ష్మిగారు మానసికంగా బాగా కృంగిపోయి వున్నారు. వారికి స్వాతంత్ర్యం అవసరం. మరొకరి చెప్పు చేతలలో బందీలుగా వుండటానికి ఎవరూ ఇష్టపడరు. నాకు మనవాళ్ళంటే ఎనలేని అనురాగం. వీరు నాతో వుంటే నాకూ సంతోషంగా వుంటుంది" చెప్పారు పైడయ్యగారు. దాదాపు తన తండ్రి వయ సున్న వ్యక్తితో తల్లి కలిసి వుండబోవటం ఉదయ్‌కి నచ్చలేదు. అదే అన్నాడు కూడా. ఆయన నవ్వి చెప్పాడు.



కలకత్తా, బొంబాయి, మద్రాస్ ఈ మూడు యూనివర్శిటీలు ఒకే సంవత్సరం – 1857లో ప్రారంభించబడ్డాయి.

"ఈ వయస్సులో కలిసి వుండేది శారీరక వాంఛల కోసం కాదు. నా భార్య గతించి అప్పుడే పన్నెండేళ్ళయింది. నాకలాంటి భావం ఏనాడూ లేదు. నాకూ ఆంధ్రా పద్ధతులూ, భాషా నేర్చుకునే అవకాశం కలుగుతుంది. ఇద్దరం ఒకే పడవలో ప్రయాణిస్తున్న ప్రయాణీకులం. ఆమె కూడా నా ఆలోచనలతో ఏకీభవించాకే నేనిలా రావటం జరి గింది."

"అయ్యో! అయ్యో!! నేనన్నంతా చేసింది మీ అమ్మ ఆవిడ షోకుతో ఆ జుట్టుకు రంగు చూసి నేనప్పుడే అనుకున్నాను ఏ మగవాణ్ణో వెంటేసు కొస్తుందని" అన్నది కమల.

"కమలా! ఇంక వాగకు. నా జీవితాన్ని మీరు శాశించలేరు. చిన్న వయస్సులో భర్త అనురాగం, ప్రేమ కావాలి. ఆ ఋతువు దాటిపోయింది. వేసవిలో ఈ దేశంలో చూడు చెట్లు ఎంత ఆకుపచ్చగా వుంటాయో, ఫాల్లో రంగులు ఎలా మారతాయో! ఆ వెంటనే ఎలా రాలిపోతాయో! ఆ తరువాత ఎలా వింటర్ వచ్చి అస్థిపంజరాలౌతాయో! అలాగే నా జీవితంలో సమ్మర్, ఫాల్ రంగులూ అయిపోయాయి. పండిన ఆకులు ఎన్నో రోజులు నిలవవు. ఆ రంగుల ఆకులు చూసి మనందరం ఎంత ఆనం దిస్తున్నామో ఒక్కసారి అర్థం చేసుకో. వింటర్ వస్తుందనే బాధతో ఫాల్‌ని ఆనందించకుండా ఎవ్వరూ వుండరు. ముదిమి వచ్చింది కాబట్టి, నేను నేడో రేపో పోతాననే భావంతో నా కోర్కెలను చంపుకుని బ్రతకాల్సిన అవసరం నాకు కనబడలేదు. భర్త అనురాగానికి దూరం అయ్యాక నన్ను ఆదరించే మనస్సున్న మనిషి ఎవరైనా తటస్థపడితే చాలని పించింది. అందులోనూ మీ ఇద్దరి కాఠిన్యం చవి చూశాక మరింత అనిపించింది.

"ఏం, నాకు కోరికలుండవని ఈ టొరంటో శాసనమేదైనా వుందా! విషయం ఎంత చిన్నదైనా అంకమ్మ జాతర చేస్తావు నువ్వు ప్రతిసారీను. నేనేం మీ బానిసను కాను. నాకొచ్చే ఓల్డేజ్ పెన్షన్‌తో నేను చక్కగా బ్రతగ్గలను. మీరేమైనా తికమక చేసి ఆ డబ్బు నాకు రాకుండా చేసినా నేను బ్రతగ్గలను. నీ ధర్మమా అని నేర్చుకున్నవి బేబీ సిట్టింగ్, గ్రాస్ కట్టింగ్, స్నో షవరింగ్, వాక్యూమింగ్ అన్నీ వున్నాయి కదా! ఇందులో ఏ ఒక్కటైనా నాకు గుప్పెడు మెతు కులు పెట్టకపోదు. ఇంతకాలం నీకు ఊడిగం చేశాను గదా! ఖాళీగా వున్నప్పుడు పైడయ్య గారితో పాటు పూజలు చేయించడానికి నేనూ వెళ్తాను."

"స్కార్ బరోలో ఫించ్ మీదున్న దుర్గా టెంపుల్ వెనుకే మేముండేది. అది టూ బెడ్‌రూమ్ అపార్ట్ మెంట్. ఇదుగో అడ్రసూ - టెలిఫోన్ నెంబరూ. మీరు రాదల్చుకుంటే ఎప్పుడైనా ఫోన్ చేసి రావచ్చు. పదండి పైడయ్యగారూ వెళ్దాం" చెప్పింది ఆయనవైపు తిరిగి.

ఆయన ఆమె సూట్‌కేస్ అందుకున్నారు. ఆమె బ్యాగ్ తీసుకుంది. ఇద్దరూ బయటకు నడిచారు.

కారులో కూర్చున్న తరువాత ఆమె చెప్పింది. "పైడయ్యగారూ, మీ మేలు మరువలేను. నేనిప్పుడు స్వేచ్ఛగా గాలి పీల్చుకోగలను. అనుక్షణం భయంతో నా కొడుకూ కోడళ్ళ దగ్గర గడిపిన ఈ మూడు సంవత్సరాల జీవితం ఒక పీడకలలా మరచిపోయేం దుకు ప్రయత్నిస్తాను. వాళ్ళ దగ్గర నేను కన్నీళ్ళు పెట్టుకోని రోజంటూ లేదు. ఇంక నా శేష జీవితాన్ని ప్రశాంతంగా సాధ్యమైనంత ఆనందంగా గడిపేందుకు ప్రయత్నిస్తాను."

"మై ప్లెజర్. మీవంటి ఉత్తములు సంతోషంగా గడపటమే నాకు కావలసింది. లేకపోతే నేను చేయించే పూజలకు అర్థమే లేదు. నేను ఇండియా ఎలా వుంటుందో ఎరుగను. కానీ ఇండియా గురించి పురాణాలూ, చరిత్రా చదివాను. కష్టంలో వున్న వారికి వారి ఇచ్ఛననుసరించి మార్గాన్ని చూపటం, చేయూతనివ్వటం నా ధ్యేయం. మీ విషయంలో ఈవిధంగా జరిగింది. అంతా పరమేశ్వ రేచ్ఛ. నా రక్షణలో వున్నంతకాలం మీకెలాంటి భయం లేదు. మీకు ఇష్టం లేని పనిని మీరు చేయ వద్దెప్పుడూ. మీ మనస్సును కష్టపెట్టినవార్ని కనీసం కొంతకాలం చూడకండి. నావల్ల మీకెలాంటి కష్టం రాదు."

సడన్‌బ్రేక్‌తో కారాగింది.

"ఇక్కడాపారేం?" అడిగింది ఆదిలక్ష్మి

"ఈపూట నుంచీ కొత్త జీవితాన్ని ప్రారంభించ బోతున్నారు కనుక 'ఆదిశక్తి' అయిన దుర్గా మాతను దర్శించండి. మీకు శుభం కల్గుతుంది." చెప్పాడా యన. ఆయన ఒక మహనీయుడిలా అనిపించాడు ఆదిలక్ష్మికి. "మంచి మనిషి" అనుకుంది మనసులో.